క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఈవోఆర్డీ

కురిచేడు: మండల ఈవోఆర్డీగా ఆర్‌వీఎస్ ప్రసాదరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోఆర్డీగా పనిచేస్తున్న దారా హనుమంతరావు అద్దంకి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సంతమాగులూరు నుంచి బదిలీపై వచ్చిన ప్రసాదరావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, డీఈవోలతో సమావేశం నిర్వహించారు. జూన్ 15 నాటికి ఇంటిపన్నులు పూర్తిగా వసూలు చేయాలని, జూన్ 30 నాటికి పంచాయతీ ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. మండలంలో శానిటేషన్, తాగునీరు, స్వచ్ఛ సంకల్పంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామాలకు ముందు, వెనుక నైదిబ్బలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వీధిదీపాలు సక్రమంగా వెలిగేలా చర్యలు తీసుకోవాలని, స్పందన అర్జీలు పరిశీలించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీపీ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని నవరత్నాల అమలుకు కృషిచేస్తానన్నారు.

విత్తన దుకాణాలపై దాడులు

తాళ్లూరు: విత్తన నాణ్యతపై దృష్టి సారించి విత్తన నమూనాలను నాణ్యతా ప్రమాణాల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించడం జరుగుతుందని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరంలో ప్రసన్నాంజనేయ సీడ్స్ దుకాణాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీపీటీ 5204 రకం, ఎంపీయూ 1010 రకాలను రీజినల్ కోడింగ్ సెంటర్లయిన తాడేపల్లిగూడెం, విశాఖపట్నంకు పంపించినట్లు చెప్పారు. ప్రతి విత్తనాల దుకాణంలో తప్పనిసరిగా తనిఖీలు చేస్తామని చెప్పారు. రైతులు తాము తీసుకున్న విత్తనాలకు తప్పనిసరిగా రసీదులు పొందాలని సూచించారు. ప్రభుత్వం విత్తనాల నాణ్యత విషయంలో చాలా గట్టిగా వ్యవహరిస్తోందని చెప్పారు. విత్తనాలలో ఏవైనా లోపాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రెజ్లర్లకు న్యాయం చేయాలి

కంభం: రెజ్లర్ల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ భారతీయ రెజ్లర్లు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా బుధవారం స్థానిక కందులాపురం కూడలిలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రజా సంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. సీపీఐ జిల్లా నాయకులు తోట తిరుపతిరావు దేశానికి పతకాలు సాధించి పెట్టిన రెజ్లర్లపై అసభ్యంగా ప్రవర్తించిన ఒక ఎంపీని అరెస్టు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకే కళంకం అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రంగనాథ్, వెంకట్, బేగ్, గురప్ప, బాలగురవయ్య, రంగయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రందన.. అంతకు మించిన వేదన!

- రోడ్డుపై గేదెను తప్పించబోయి బైక్ బోల్తా
- తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి
- నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదానికి మృతుడి సోదరుడు బలి
- రెండు నెలల క్రితం మరో సోదరుడు ఆత్మహత్య
- శోకసంద్రంలో కుటుంబ సభ్యులు



శవాని పరిశీలించి వివరాలు సేకరిస్తున్న ఎస్సై కృష్ణపావని

హనుమంతునిపాడు: చేతికందివచ్చిన కుమారులు ఒకరి తర్వాత ఒకరు మృతి చెందడం ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. నాలుగేళ్ల క్రితం ప్రమాదంలో ఒకరు, రెండు నెలల కిందట ఆత్మహత్య చేసుకుని మరొకరు.. మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో ఇంకో కుమారుడు కన్నుమూయడం ఆ కుటుంబాన్నే కాదు గ్రామస్తులనూ కలిచివేసింది. వివరాల్లోకి వెళ్తే.. వేములపాడు గ్రామానికి చెందిన మద్దికుంట్ల నారాయణ, పద్మావతి దంపతులకు ముగ్గురు కుమారులు కృష్ణ, అశోక్, శివకుమార్ ఉన్నారు. నారాయణ తన పెద్ద కుమారుడు కృష్ణ(36)తో కలిసి పెద్దగొల్లపల్లిలో ఓ శుభకార్యానికి వంట చేసేందుకు వెళ్లారు. పని పూర్తయిన తర్వాత తండ్రిని ఇంటి వద్ద వదిలిపెట్టిన కృష్ణ తిరిగి పెద్దగొల్లపల్లికి వెళ్లాడు. అక్కడి నుంచి మంగళవారం అర్ధరాత్రి వేళ స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో పెద్దగొల్లపల్లి సమీపంలోని పాలకేంద్రం వద్ద రోడ్డుపై అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి అదుపుతప్పి పడిపోయాడు. కృష్ణ తలకు తీవ్ర గాయం కావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వేములపాడు ప్రైవేట్ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణపావని తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరిని, ఆత్మహత్య రూపంలో మరో కుమారుడిని మృత్యువు కబళించడంతో తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు శోకసంద్రంలో మునిగిపోయారు.

మత్తిచ్చి.. మాయ చేశారు!



తలమళ్లలో విచారిస్తున్న ఎస్సై

పొదిలి రూరల్: ఇంటి ఆవరణలో గాఢ నిద్రలో ఉన్న ఓ మహిళకు గుర్తు తెలియని దుండగులు మత్తు ఇచ్చి బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన మంగళవారం అర్ధరాత్రి పొదిలి మండలంలోని తలమళ్లలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నలమోలు ఆదెమ్మ ఒంటరిగా ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఆమె స్పృహ కోల్పోయేలా చేశారు. చెవులకు ఉన్న కమ్మలు తీసుకుని, అక్కడే ఉన్న తాళంచెవి సాయంతో ఇంటి తలుపులు తెరిచారు. ఇల్లు మొత్తం గాలించి 3 సవర్ల బంగారం తాడు, రూ.16 వేల నగదుతో ఉడాయించారు. ఆదెమ్మకు స్పృహ వచ్చి తేరుకున్న తర్వాత కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. ఎస్సై మల్లికార్జునరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై గొడ్డలితో దాడి

అర్ధవీడు(కంభం): మహిళపై ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసిన సంఘటన అర్ధవీడు మండలంలోని బోగోలు గ్రామంలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. వల్లెల పోలమ్మ అనే మహిళ మరో మహిళతో కలిసి సాయంత్రం బహిర్భూమికి వెళ్లి వస్తుండగా గ్రామానికి చెందిన చేగిరెడ్డి వెంకటరామిరెడ్డి అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశాడు. క్షతగాత్రురాలిని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దాడికి పాల్పడ్డ చేగిరెడ్డి వెంకటరామిరెడ్డి ఇల్లు క్షతగాత్రురాలి ఇంటి సమీపంలో ఉంది. మంగళవారం రాత్రి తాము నిద్రిస్తున్న సమయంలో మద్యం తాగొచ్చి గొడవ చేసి వెళ్లాడని బాధితులు తెలిపారు. గతంలో కూడా పలుమార్లు మద్యం తాగి పలువురితో గొడవ పడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. గతంలో ఇతనిపై ఓ కేసు నమోదైందని పోలీసులు తెలిపారు.

చెంచు యువకుడిపై ఎలుగుబంటి దాడి

యర్రగొండపాలెం: మండలంలోని దద్దనాల చెంచు గూడెంకు సమీపంలోని అడవుల్లో బుధవారం చెంచు యువకుడిపై ఎలుగుబంటు దాడి చేసింది. ఆ గూడెంకు చెందిన కుడుముల అంకన్న పాలగడ్డలు సేకరించుకోవటానికి అడవిలోకి వెళ్లాడు. అక్కడ అతనిపై ఎలుగుబంటి దాడి చేయడంతో తప్పించుకునేందుకు పరుగులు తీసిన అంకన్న.. కాలుజారి కిందపడ్డాడు. దీంతో తన చేతిలో ఉన్న అంబు తగలడంతో అతనికి గాయమైంది. క్షతగాత్రుడు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

ఏం కష్టమొచ్చిందో ఆ తల్లికి..!

- రైలు కింద పడి మహిళ ఆత్మహత్య



రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహం

దొనకొండ(దర్శి టౌన్): రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమైన ఓ మహిళ చివరి క్షణంలో మనసు మార్చుకుని తప్పించుకునేందుకు చేసిన ప్రయత్నం విఫలమైంది. రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాతపడింది. ఈ విషాద ఘటన మంగళవారం అర్ధరాత్రి దొనకొండ రైల్వే స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం మేరకు.. వినుకొండ పట్టణం దేవానగర్‌కు చెందిన పగడాల బుజ్జి(52) భర్త వీరయ్య 20 ఏళ్ల క్రితం మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ భారం ఆమెపై పడింది. వెల్లుల్లి, ఇతర వస్తువులు విక్రయిస్తూ తన ఇద్దరు కుమార్తెలు, కుమారుడిని పెంచి పెద్ద చేసింది. అందరికీ వివాహాలు చేసింది. ఏం కష్టమొచ్చిందో తెలియదు కానీ మంగళవారం రాత్రి ఓ సంచిలో దుస్తులు పెట్టుకుని దొనకొండ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అర్ధరాత్రి దాటిన తర్వాత కొండవీడు ఎక్స్‌ప్రెస్ వస్తున్న సమయంలో రైల్వే ట్రాక్‌పై కొంత సేపు నిల్చుంది. చివరి క్షణంలో ఆత్మహత్యా యత్నాన్ని విరమించుకున్న ఆమె రైల్వే ట్రాక్ నుంచి పక్కకు తప్పుకునే క్రమంలో వేగంగా వస్తున్న ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. లోకోపైలట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే ఎస్సై సుబ్బారావు, దొనకొండ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి పూర్ణమహేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతురాలి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ రైల్వేస్టేషన్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

గరుడ వాహనంపై తిరుమలనాథస్వామి



ప్రత్యేక అలంకారంలో గొబ్రాలికొండ తిరుమలనాథస్వామి

పెద్దారవీడు: మండలంలో రాజంపల్లి సమీపంలో వెలసిన శ్రీ విభూదేవి సమేత గొబ్రాలికొండ తిరుమలనాథస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు భవానీప్రసాద్ ఆధ్వర్యంలో స్వామికి పూజలు నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై తిరుమలనాథ స్వామిని మేళతాళాలతో ఊరేగింపు చేశారు. ఉభయదాతలు బోయినపల్లి చిన్నసత్యనారాయణ, నిమ్మరాజుకుమార్, మార్కాపురం పట్టణానికి చెందిన ఓరుగంటి విద్యాసాగర్, వాదంపల్లి గ్రామానికి చెందిన రంగనాయకశర్మ, గడివేముల గ్రామానికి చెందిన కొండూరు ఆదినారాయణశర్మ దంపతులు వ్యవహరించారు. బ్రహ్మణ, రెడ్ల సత్రాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం రాష్ట్రస్థాయి న్యూకేటగిరి విభాగంలో పశు బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

యర్రగొండపాలెం: తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా విద్యార్థులు చదువుల్లో ఉన్నత శిఖరాలను అధిష్టించాలని ఎంఈఓ పి.అంజనేయులు అన్నారు. 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను విద్యాకమిటీ మాజీ చైర్మన్ గోళ్ల వీర వెంకట సుబ్బారావు ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి ప్రసాద్, పి.లక్ష్మీనారాయణ, నానా నాగేశ్వరరావు, జి.శేషయ్య, సుభాని, శంకరరెడ్డి, మురళి పాల్గొన్నారు.

వడదెబ్బకు వృద్ధురాలు మృతి

ముండ్లమూరు: మండలంలోని పోలవరం గ్రామంలో వడదెబ్బకు కుర్ర సీనమ్మ(85) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రెండు రోజులుగా వేడిగాలులు వీస్తుండటంతో అస్వస్థతకు గురై బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆమె కుమారుడు పెద్దన్న చెప్పారు.

గ్యాస్ లీకై దుకాణం దగ్ధం



ముండ్లమూరు: గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగడంతో దుకాణం దగ్ధమైన సంఘటన ముండ్లమూరు మండలం మారెళ్ల గ్రామ బస్టాండ్ సెంటర్‌లో చోటుచేసుకుంది. సన్నెబోయిన ఏడుకొండలుకు చెందిన బుధవారం ఉదయాన్నే దుకాణం వద్దకు వచ్చారు. టీ పెట్టేందుకు ప్రయత్నిస్తుండగా గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఏడుకొండలు, కుటుంబ సభ్యులు బయటకు పరుగు తీశారు. దుకాణంలో ఉన్న సరుకులు, ఫ్యాన్సీ వస్తువులు కాలి బూడిదయ్యాయి. మంటలు పక్క దుకాణాలకు వ్యాప్తి చెందకుండా స్థానిక వ్యాపారులు అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయాడు.

సత్తా చాటిన నంద్యాల ఎడ్లు



బండ లాగుతున్న ఎడ్లు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు గ్రామంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బత్తుల చిన్నబ్బాయ్ యాదవ్ ఎడ్లు 3,680 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.40 వేలు, కంభం మండలం ఎర్రబాలేనికి చెందిన వెంకటగిరి హేమలతానాయుడు ఎడ్లు 3,664 అడుగులతో ద్వితీయ బహుమతి రూ.30 వేలు, నరసరావుపేట మండలం పమిడి గ్రామానికి చెందిన జాగు నెమిలయ్య ఎడ్లు 2,917 అడుగులతో తృతీయ బహుమతి రూ.20 వేలు, నంద్యాల జిల్లా ఎస్.కొత్తపల్లెకు చెందిన ఎం.వెంకటేశ్వర్లు ఎడ్లు 2,764 అడుగులతో నాలుగో బహుమతి రూ.10 వేలు, నంద్యాల జిల్లా బోయలకుంట్లకు చెందిన షేక్ సుభహాన్ ఎడ్లు 2480 అడుగులతో ఐదో బహుమతి రూ.5 వేలు గెలుపొందాయి. ఆలయ కమిటీ సభ్యుల చేతులమీదుగా ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

గుండెపోటుతో యువకుడు మృతి

పొదిలి: గుండెపోటుతో బి.ఫార్మసీ విద్యార్థి మృతి చెందిన సంఘటన బుధవారం పొదిలి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. కనిగిరికి చెందిన ఎస్.బ్రహ్మేశ్వర్(20) కంభాలపాడులోని బిట్స్ కళాశాలలో బి.ఫార్మసి రెండో సంవత్సరం చదువుతున్నాడు. గుండె సంబంధిత వ్యాధి ఉండటంతో కనిగిరి నుంచే రోజూ కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం బాగోలేక గత నాలుగు రోజులుగా కళాశాలకు రాలేదు. బుధవారం కళాశాలకు వచ్చిన వెంటనే అస్వస్థతకు గురికావడంతో పొదిలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు తరలించే ప్రయత్నంలో ఉండగా మృతి చెందాడు.

పిడుగుపాటుకు కార్మికుడు మృతి



మృతి చెందిన సుబ్బారావు

త్రిపురాంతకం: ఇటుక బట్టీలో పనిచేసే కార్మికుడు పిడుగుపాటుకు బలయ్యాడు. త్రిపురాంతకం మండలంలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సోమేపల్లి గ్రామంలో ఇటుక బట్టీల వద్ద పిడుగు పడటంతో తూర్పుగోదావరి జిల్లా కాజులూరు మండలం ఉప్పెల్లి గ్రామానికి చెందిన బుంగా సూర్యనారాయణ(60) అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. హుటాహుటిన త్రిపురాంతకం పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇటుకల బట్టీలో పనిచేసేందుకు సూర్యనారాయణ వారం రోజుల క్రితం చిన్న కుమారుడితో కలిసి వచ్చాడు. మృతుడికి ఐదుగురు కుమారులు కాగా అందరికీ వివాహమైంది. సూర్యనారాయణ మృతి బట్టీ కార్మికులను ఆవేదనకు గురిచేసింది.

జూడో సంఘ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణరావు

ఒంగోలు: ప్రకాశం జిల్లా జూడో సంఘ అధ్యక్షుడిగా ఎం.లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం స్థానిక మాంటిస్సోరి స్కూలు ఆవరణలో జిల్లా కార్యవర్గ ఎంపిక నిర్వహించారు. నూతన కమిటీ ఎంపికను రాష్ట్ర జూడో సంఘ అధ్యక్షుడు ఆనం రామకిషోర్‌రెడ్డి పర్యవేక్షించారు. చైర్మన్‌గా పి.శబరీనాథ్, ప్రధాన కార్యదర్శిగా డి.వెంకటేశ్వర్లు, కోశాధికారిగా పి.వెంకట నారాయణ, ఉపాధ్యక్షులుగా డీఎస్‌వీ సుధాకర్, సీహెచ్ మహేష్ ఎంపికయ్యారు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన సివిల్ సప్లయిస్ డీటీ



ఎమ్మెల్యే కేపీని సన్మానిస్తున్న డీటీ చంద్రశేఖర్

మార్కాపురం: మార్కాపురం సివిల్ సప్లయిస్ గోడౌన్ డిప్యూటీ తహశీల్దార్‌గా నియమితులైన ఎస్.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డిని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల కోసం ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, దీనిని సక్రమంగా నిర్వహించేలా చూడాలని డీటీకి సూచించారు. ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కార్యదర్శి వి.శ్రీనివాస్ ఉన్నారు.

పెన్షనర్‌లు ఈకేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి

కంభం: పెన్షనర్లందరూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా ఖజానా అధికారి జగన్నాథరావు తెలిపారు. బుధవారం కంభం ఉపఖజానా కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం యూనియన్ నాయకులు, ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాండు, ఇబ్రహీం, కలాం తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

కంభం: కందులాపురం కూడలి నుంచి డా.బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాన్ని తొలగించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని కోరుతూ బుధవారం మండల తహసీల్దార్ రవికి ఎమ్మార్పీఎస్ నాయకులు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ నాయకుడు పానుగంటి షాలెంరాజు మాట్లాడుతూ హైవేని అనేక లోపాలతో నిర్మించారని విమర్శించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో చాట్ల డానియల్, జయరాజ్, భాస్కర్, శేఖర్, రమేష్‌బాబు, యాకోబు, రవి, ఏసు పాల్గొన్నారు.

నేటి నుంచి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డు శివాజీ నగర్‌లో ప్రసన్న వెంకటేశ్వరస్వామి పంచమ బ్రహ్మోత్సవాలు ఈ నెల 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావిపాటి రామారావు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, అదనపు కార్యదర్శి నిట్టూరి వెంకటరమేష్ బుధవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 8వ తేదీన అంకురార్పన, 9న శేషవాహనం, 10న హనుమంత వాహనం అనంతరం స్వామివారి కళ్యాణం నిర్వహిస్తునట్లు వివరించారు. 11న అశ్వవాహనం, స్వామివారికి పుష్పయాగం, 12వ తేదీన ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

కల నెరవేరిన వేళ.. ఆనంద హేల

- కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కేబినెట్ ఆమోదం
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై హర్షం
- సీఎం వైఎస్ జగన్‌కు ఉద్యోగుల కృతజ్ఞతలు

సాక్షి నెట్‌వర్క్: ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేకపోవడంతో ప్రభుత్వాలు మారినప్పుడల్లా ఎక్కడ తొలగిస్తారోనన్న భయంతో బిక్కుబిక్కుమన్న ఉద్యోగులు ఇకపై దిగులు చెందకుండా విధులు నిర్వహించే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. బుధవారం తాడేపల్లిలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కేబినెట్ సమావేశంలో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలనే తీర్మానానికి మంత్రి మండలి ఆమోదముద్ర వేసింది.

తమ సర్వీసును గుర్తించి రెగ్యులైజేషన్ చేస్తారని ఆశిస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. గత సార్వత్రిక ఎన్నికల వేళ ప్రజాసంకల్ప పాదయాత్రలో కాంట్రాక్ట్ ఉద్యోగుల కష్టాలు విన్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. సీఎం వైఎస్ జగన్ తీసుకున్న సాహసోపేత నిర్ణయం కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగులు నింపింది.

20 ఏళ్ల శ్రమకు ఫలితం దక్కింది



20 ఏళ్ల నుంచి కాంట్రాక్టు ఉద్యోగిగా రూ.2500 నుంచి రూ.32 వేల జీతం వరకు పనిచేశాను. ప్రభుత్వ ఉద్యోగిగా మారుతున్నామంటే చాలా ఆనందగా ఉంది. ఇన్నేళ్లుగా పడిన శ్రమకు తగ్గ ఫలితం దక్కింది.
– దుగ్గిప్తో రాణమ్మ, ఎంపీహెచ్‌ఏ, ముండ్లపాడు సబ్‌యూనిట్, సంజీవరాయుడుపేట పీహెచ్‌సీ

ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాం :



ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఎదురు చూస్తున్నాం. ఏనాటికైనా కల నెరవేరుతుందని అనుకున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీతో ఆశలు చిగురించాయి. నేడు సీఎం తీసుకున్న నిర్ణయం ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపుతోంది.
రమేష్, ఫార్మసిస్ట్, తాళ్లూరు పీహెచ్‌సీ

సీఎం ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు



ఇచ్చిన మాటను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకుంటున్నారు. 2007 నుంచి హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా రెగ్యులరైజేషన్ కోసం ఎదురుచూస్తున్నాం. మా కుటుంబాలకు అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– గర్రె వెంకట సత్యగురుప్రసాద్, హెల్త్ అసిస్టెంట్, మోక్షగుండం,

సీఎంకు రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం పది వేల మంది ఉద్యోగుల కుటుంబాల్లో వెలుగు నింపింది. సీఎంకు మేమంతా రుణపడి ఉంటాం. ఏపీ వైద్య విధాన పరిషత్ ఉద్యోగుల జీతాలు 010 పద్దు కింద ఇవ్వాలని నిర్ణయించడం చాలా సంతోషం.
– ఎ శివకృష్ణ, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ అసోసియేషన్ అడ్వైజర్

ప్రభుత్వానికి ధన్యవాదాలు



నేను 20 ఏళ్లుగా కొనకనమిట్ల పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా సేవలందిస్తున్నా. రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని గత ప్రభుత్వాలను కోరినా పట్టించుకోలేదు. నా ఉద్యోగం రెగ్యులర్ కావడం జీవితంలో మర్చిపోలేని సంఘటన.
– పి.ఓంకారం, హెల్త్ అసిస్టెంట్, కొనకనమిట్ల

చాలా సంతోషం



2003 నుంచి వైద్యారోగ్య శాఖలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌గా కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలిందిస్తున్నా. ప్రస్తుతం పెద్ద దోర్నాలలో పని చేస్తున్నా. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయం చాలా సంతోషాన్ని కలిగించింది.
– జే వెంకటేశ్వర రెడ్డి, ఎంపీహెచ్‌ఏ పెద్ద దోర్నాల

నిరీక్షణ ఫలించింది



2003లో కాంట్రాక్ట్ పద్ధతిపై వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగంలో చేరా. తక్కువ వేతనమైనా రెగ్యులర్ అవుతామన్న ఆశతో 20 ఏళ్లుగా ఎదురుచూశా. కేబినెట్ మీటింగ్ జరిగినప్పుడల్లా రెగ్యులర్ విషయం వస్తుందేమోనని ఎదురుచూశాం. సీఎం వైఎస్ జగన్ దయతో మా నిరీక్షణ ఫలించింది. మా కుటుంబాల కష్టాలను తీర్చే నిర్ణయం తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాం.
– ఎల్.శ్రీనివాసరెడ్డి, ఎంపిహెచ్‌ఏ(ఎం), తలమల్ల సబ్ సెంటర్

ఎప్పటికీ మరిచిపోలేను



20 సంవత్సరాలుగా కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాను. ఎన్నో సార్లు పని మానేసి వేరే పనిచేసుకుందామని అనిపించినా ప్రభుత్వం ఎప్పటికైనా రెగ్యులర్ చేస్తుంది కదా అనే ఆశతో అలాగే కొనసాగుతూ వచ్చాను. నేటికి మా చిరకాల కోరిక నెరవేర్చిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.
– షేక్.రహమ్మత్తుల్లాఖాజా, ఎంపీహెచ్‌ఏ, కేఎస్‌పల్లె పీహెచ్‌సీ

మాటల్లో చెప్పలేని ఆనందం



104లో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నా. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో మాటల్లో చెప్పలేని ఆనందం కలిగింది. మేము ప్రభుత్వ ఉద్యోగులుగా మారిపోతున్నామనే ఆనందంతో ఏం చెప్పాలో అర్థం కావడం లేదు.
– ఎం.వెంకటేశ్వరయ్య, 104 ఉద్యోగి, కేఎస్‌పల్లె పీహెచ్‌సీ పరిధి

మితిమీరిన వేగంతో వెళ్లవద్దు

– గిద్దలూరు సీఐ దేవప్రభాకర్



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న గిద్దలూరు సీఐ దేవప్రభాకర్

కొమరోలు: వాహనదారులు మితిమీరిన వేగంతో వాహనాలను నడపవద్దని గిద్దలూరు సీఐ దేవప్రభాకర్ సూచించారు. స్థానిక 4 రోడ్ల కూడలి వద్ద బుధవారం గిద్దలూరు సీఐ దేవప్రభాకర్ వాహనదారులు, ప్రజలకు రహదారి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ దేవప్రభాకర్ మాట్లాడుతూ మైనర్లకు వాహన యజమానులు వాహనాలను ఇవ్వవద్దన్నారు. మైనర్లు వాహనాలు నడిపినట్లయితే వాహనదారులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కొమరోలు ఏఎస్‌ఐలు గోపాలకృష్ణ, జిలానిబాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రత అందరి బాధ్యత



మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి

మార్కాపురం: ఆహార భద్రత అందరి బాధ్యత అని ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, వీహెచ్‌ఆర్ విద్యా సంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆహార భద్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది, వంట సిబ్బంది కలిసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం వంట సిబ్బందికి ఆహార భద్రతకు సంబంధించిన కిట్లు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉష ఈశ్వరన్, డిప్లొమా ఇన్చార్జి అబ్దుల్ కలాం, హెచ్ఓడీలు సురేందర్‌రెడ్డి, సాయి బాబా, రాజశేఖర్‌రెడ్డి, పుష్పలత, సత్యవాణి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ



జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పుల్లలచెరువు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు బుధవారం జగనన్న విద్యాకానుక కిట్లను ఎంఈఓ శామ్యూల్‌జాన్ పంపిణీ చేశారు. ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీ పాఠశాల నుంచి వివిధ పాఠశాలల సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న దృష్ట్యా పాఠశాలలు తెరిచిన రోజునే విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందచేయాలన్నారు. ఈ విషయంలో అశ్రద్ధ చేయకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఉపాధి పనులు తనిఖీ



రాచకొండలో పనులు పరిశీలిస్తున్న పీడీ

పుల్లలచెరువు: మండలంలోని రాచకొండలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను డ్వామా పీడీ శీనారెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను పలు ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే తప్పక రూ.272 కూలి వస్తుందన్నారు. పనులు సకాలంలో చేయాలని, మస్టర్లు ఎలా వేస్తున్నారని సిబ్బందిని అడిగారు. పనులకు రాని వారికి మస్టర్లు వేయవద్దన్నారు. పని కల్పించడం లేదని ఏ గ్రామం నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. అనంతరం గ్రామంలోని ఉద్యావన పంటను పరిశీలించి రైతులను ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు వస్తున్నాయా, సిబ్బంది సక్రమంగా పనిచేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏపీఓ ఏలీషా, ఈసీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి

కంభం: చిన్నచిన్న విషయాలకు గొడవలు పడి కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరగొద్దని స్థానిక సీఐ యం.రాజేష్, ఎస్సై నాగమల్లేశ్వరరావు సూచించారు. మండలంలోని హజరత్‌గూడెం, తురిమెళ్ల గ్రామాల్లో బుధవారం రాత్రి పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమస్యలు ఏవైనా ఉంటే శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. సైబర్ నేరాల పై అవగాహన కల్పించి జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు వివరించారు. దొంగతనాలు జరగకుండా అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామప్రజలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ముండ్లమూరు: గ్రామాల్లో ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎల్.సంపత్ కుమార్ సూచించారు. మండలంలోని ఉమామహేశ్వరపురం, పూరిమెట్ల గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో రోజురోజుకీ సైబర్ నేరగాళ్లు పెరుగుతున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏటీఎం కార్డుతో బ్యాంకులకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫోన్‌పే వాడే సమయంలో ఇతరులకు పిన్ వివరాలు చెప్పకూడదని తెలిపారు. ఇళ్ల వదిలి వెళ్లినప్పుడు ఇంట్లో సామానులకు భద్రత ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి గురు పౌర్ణమి ఉత్సవాలు



సాయి మందిరం

మార్కాపురం: పట్టణంలోని నెహ్రూ బజారులో షిర్డీ సాయి బాబా మందిరంలో ఈ నెల 8 నుంచి జూలై 4వ తేదీ వరకు గురు పౌర్ణమి ఉత్సవాలు నిర్వహిస్తునట్లు మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జూలై 3వ తేదీన గురు పౌర్ణమిని పురస్కరించుకుని 26 రోజులపాటు బాబా మందిరంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 8న సాయి నామ ఏకాహం, 9న సాయిబాబాపై క్విజ్ పోటీలు, 10న సాయి భక్తి గీతాల పోటీలు, 11 నుంచి 14 వరకు సాయి భిక్షాటన, 15 నుంచి 21వ తేదీ వరకు ప్రముఖులతో ఆధ్యాత్మిక ఉపన్యాసం, 22 నుంచి 29 వరకు అఖండ పారాయణం, జూలై 1, 2వ తేదీల్లో సామూహిక విష్ణు, లలిత సహస్ర నామార్చన, జూలై 3న గురు పౌర్ణమి సందర్భంగా 25 వేల మంది భక్తులకు అన్నదానం, 4న సాయినాథుని చిత్రపటంతో రథోత్సవం నిర్వహించనునట్లు వివరించారు. కాగా ఉత్సవాల సందర్భంగా సాయి మందిరాన్ని రంగులతో, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దుతున్నారు.

